1st Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health — Best for Readers

సంపుటి : 3 సంచిక : 01 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 01 జనవరి 2026 పేజీలు 8 : వెల 3/–ఒంగోలు

VOLUME : 03 ISSUE : 01 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 01 January 2026 PAGES : 8 PRICE : 3/-







# లోకేశ్ మార్క్ : విద్య, ఐటీ, నైపుణ్యంలో ఏపీ దూకుడు



- రికార్డు సమయంలో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ పూర్తి
- అమరావతిలో క్వాంటం వ్యాలీ, గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు అడుగులు
- రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్న ఐటీ శాఖ
- 4 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ, 1.45 లక్షల మందికి ఉద్యోగాలు
- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు.. కేంద్రం ప్రశంసలు
- అంతర్జాతీయంగా ఏపీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 31)**

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో ఈ మూడు కీలక శాఖల్లో అమలు చేస్తున్న సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. ఒకవైపు విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూనే, మరోవైపు భారీ పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రాష్ట్ర విద్యావ్యవస్థను దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఐదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ, కేవలం 150 రోజుల రికార్డు సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తిచేశారు. పైరవీలకు తావులేకుండా 'టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్' ద్వారా పారదర్శకంగా బదిలీలు చేపట్టారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు 'నో బ్యాగ్ డే', క్రీడలు, జీవన నైపుణ్యాలపై దృష్టి సారించారు. ఉపాధ్యాయులపై –మిగతా 2లో

## చొరబాటుదారులకు మమత దన్ను

కేంద్రానికి భూమి ఇవ్వక కంచె వేయలేకపోతున్నాం

మేం వచ్చాక పిట్టనైనా రానివ్వం: అమిత్‌షా

ఉగ్రదాదుల్ని ఆపలేని షా రాజీనామా చేయాలి: మమత



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 31)**

కోల్‌కతా: ఎన్నికల్లో లబ్ధి పొందడానికి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బంగ్లాదేశీల చొరబాట్లను ప్రోత్సహిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. దీనివల్ల గత కొన్నేళ్లలో రాష్ట్రంలో జనాభా కూర్పు ప్రమాదకర రీతిలో మారిపోతోందని చెప్పారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చొరబాట్లపై బెంగాల్ ప్రజల్లోనూ కలవరం ఉందని, 2026 ఎన్నికల్లో 2/3వ వంతు ఆధిక్యంతో భాజపా అధికారంలోకి వచ్చి ఈ బెడదకు అడ్డుకట్ట వేస్తుందని చెప్పారు. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, చొరబాటుదారుల్ని తరిమికొట్టడమే ప్రధాన ఎజెండాగా నిలుస్తుందని తెలిపారు. "బెంగాల్ ప్రభుత్వం భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేకపోతోంది. ఇతర సరిహద్దు రాష్ట్రాల్లో లేని సమస్య ఇక్కడే ఎందుకు ఉందో మమత సమాధానమివ్వాలి. మేం అధికారంలోకి వచ్చాక చొరబాటు దారుల్ని కాదు కదా.. పక్షుల్ని కూడా రానివ్వనంత దృఢంగా దానిని నిర్మిస్తాం. చొరబాట్ల సమస్య యావద్దేశానిది. దీనివల్ల మన సంస్కృతి–సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరు గవుతున్నాయి. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలుతున్నాయి. ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడింది. భాజపాను గెలిపిస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసి, ఉద్యోగాలు కల్పిస్తుంది" అని హామీ ఇచ్చారు.

**దుశ్శాసనుడు వచ్చారు: మమత**

అమిత్ షా వ్యాఖ్యలపై మమత ఘాటుగా స్పందించారు. ఆయనను దుశ్శాసనుడితో పోల్చారు. దేశంలో ఉగ్రదాడుల్ని ఆపలేకపోయినందుకు –మిగతా 2లో

## ఆంధ్రప్రదేశ్ 2025: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రత్యేక కథనం



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 31)**

2024లో చారిత్రక తీర్పుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి తొలి ఆరు నెలలు వ్యవస్థలను చక్కదిద్దడానికే సరిపోయింది. ఆర్థికంగా, పరిపాలనపరంగా ఎదురైన సవాళ్లను అధిగమించి, 2025లో రాష్ట్రం ఒక స్పష్టమైన అభివృద్ధి బాట పట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ, విభజనానంతర ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి ప్రగతి పథంలో నడిపించేందుకు ఈ ఏడాదిని ఒక వేదికగా మార్చుకుంది. ఒకవైపు ప్రజల తక్షణ అవసరాలను తీర్చే సంక్షేమ పథకాలు, మరోవైపు రాష్ట్ర భవిష్యత్తుకు పునాదులు వేసే దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను ఏకకాలంలో అమలు చేయడం 2025లో ప్రభుత్వ పాలనలో కనిపించిన ప్రధాన లక్షణం. ఈ క్రమంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు 11.28 శాతానికి చేరడం విశేషం.

**సంక్షేమానికి చిరునామా: 'సూపర్ సిక్స్' సూపర్ హిట్**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలే లక్ష్యంగా, కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలను ఈ ఏడాది విజయవంతంగా అమలు చేసింది. ఈ పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరింది.సామాజిక భద్రత పింఛన్లు: పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం ఈ ఏడాది ఒక మైలురాయిని దాటింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా 31 విభాగాల లబ్ధిదారులకు పెంచిన పింఛన్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం ?50 వేల కోట్ల పంపిణీ పూర్తి చేసింది. ఇది రాష్ట్ర చరిత్రలో ఒక రికార్డు. తల్లికి వందనం: రాష్ట్రంలో విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం ?10,090 కోట్లు జమ చేసింది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఆర్థికంగా అండగా నిలవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. –మిగతా 2లో

## ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాం: మంత్రి డీఎస్‌బీవీ స్వామి



**(షణ్ముఖ వెలుగు, మర్కాపురం,డిసెంబర్ 31)**

జగన్ మాదిరిగా ప్రజలను మోసం చేయబోమని.. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ఏపీ మంత్రి డీఎస్‌బీవీ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రాజోలుపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను –మిగతా 2లో

## రాష్ట్ర ప్రజలకు, ప్రకాశం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)
రాష్ట్ర ప్రజలకు, ప్రకాశం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మాజీమంత్రి శిద్ధా రాఘవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 నూతన సంవత్సరం మీ అందరికి శుభం జరగాలని, మీరు మీ కుటుంబాలతో, సన్నిహితులతో సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, రాబోయే నూతన సంవత్సరంలో అనుకున్న విజయాలు మీ సొంతం కావాలని ఆకాంక్షిస్తు అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు శిద్ధా రాఘవరావు తెలిపారు.

## కరేడులో బాణాసంచా కాల్చి సంబురాలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 31)
కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపిన సందర్భంగా కరేడు గ్రామంలో ప్రజలు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంతోషంతో గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. గతంలో నెల్లూరు జిల్లాలో కందుకూరి నియోజకవర్గ కలిసిన సందర్భంగా ఎన్నో ఇబ్బందులకు గురయ్యామని, 140 కిలోమీటర్ల దూరం ఉన్నందున ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేసి గత ఎన్నికల సందర్భంగా ఈ నాటి ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో కలుపుతానని ప్రకటించారన్నారు. ఆ కల నేటికి నెరవేరిందని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

### కందుకూరు సీఐ అన్వర్ భాష

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 31)



నూతన సంవత్సరం 2026 సందర్భంగా కందుకూరు సర్కిల్ లోని కందుకూరు పట్టణ, కందుకూరు గ్రామీణ, ఉలవపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలోనీ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు సర్కిల్ లోని కందుకూరు పట్టణ, కందుకూరు గ్రామీణ, ఉలవపాడు ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి పట్టణంలోని రహదారుల పై పోలీస్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించబడతాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్స్, డాన్స్, పార్టీలు, రంగులు పూయడం నిషేధమన్నారు. న్యూ ఇయర్ వేడుకలలో ఉత్సవాలు, ఊరేగింపులు వంటివి నిషేధం.వాటికి ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా పెద్ద ఎత్తున డీజేలు, బాణా సంచాలు కాల్చినా, మందు పార్టీలు నిర్వహించిన కఠిన చర్యలు చర్యలు తీసుకోబడును. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసివేసి అధిక శబ్దాలతో తిరిగితే అటువంటి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయబడుతుందన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్స్ ద్వారా నిఘా ఏర్పాటు చేయడమైందన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 31)
గత ఏడాది మొత్తం మధుర స్మృతులతో గడిచిపోయింది. బాధలు, ఆనందాలు, కష్టాలు, కన్నీళ్లు, అన్నీ తీపి గుర్తులే. వాటిని కాలం నేర్పిన పాఠాలు, అనుభవాలుగా భావించండి. ఆ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, కొత్త ఏడాదిలోకి అడుగుపెడదామన్నారు. మీ ఆశలు, ఆశయాలన్నీ 2026 నూతన సంవత్సరంలో నెరవేరాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు చేపట్టే ప్రతి పని విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.

**మొదటి పేజీ తరువాయి**

## లోకేశ్ మార్క్ : విద్య, ఐటీ, నైపుణ్యంలో ఏపీ దూకుడు

భారం మోపిన 45 యాప్‌లను తొలగించి, ఒకే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.రాష్ట్రంలో అమలు చేస్తున్న 'లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' వంటి కార్యక్రమాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం ప్రశంసలు కురిపించారు. వీటితో పాటు, రాజకీయాలకు అతీతంగా విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' పేరుతో విద్యా కిట్లను అందించారు.
ఐటీ, ఎలక్ట్రానిక్స్‌లో భారీ పెట్టుబడులు ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా, దీని కోసం క్వాంటం కంప్యూటింగ్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. టీసీఎస్, కాగ్నిజెంట్, డైకిన్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. ముఖ్యంగా, రూ.87,520 కోట్ల భారీ పెట్టుబడితో రైడెన్ ఇన్ఫోటెక్ (గూగుల్) డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏకంగా రూ.1.22 లక్షల కోట్ల విలువైన 52 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. దీని ద్వారా 2.32 లక్షల మందికి ఉపాధి లభించనుందని అంచనా.
నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన విద్యా, ఐటీ రంగాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు నైపుణ్యాభివృద్ధి శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ఏడాది 4.10 లక్షల మంది యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వగా, వారిలో 1.45 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,483 జాబ్ మేళాలు నిర్వహించి 99,665 ఉద్యోగ అవకాశాలు కల్పించారు.
అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (%ంఖ్పుజుఆ%) ద్వారా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు నర్సులు, ఇంజనీర్లను పంపే కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లను ఆధునీకరించి పరిశ్రమలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. అభ్యర్థుల నుంచి ఉపాధి కల్పన వరకు అన్ని సేవలను ఒకేచోట అందించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఏఐ-ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది.

## చొరబాటుదారులకు మమత దన్ను

ఆయన తప్పనిసరిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సరిహద్దులో కంచె ఏర్పాటుకు భూమి ఇవ్వడం లేదన్న వ్యాఖ్యలను తోసిపుచ్చారు. బంకురాలో ఒక సభలో ఆమె పాల్గొని అమిత్ షాపై నిప్పులు చెరిగారు. 'శకుని శిష్యుడైన దుశ్శాసనుడు సమాచారం సేకరించేందుకు బెంగాల్‌కు వచ్చారు. ఎన్నికలు రాగానే దుర్యోధన, దుశ్శాసనులిద్దరూ కనిపిస్తారు. బెంగాల్ నుంచే ఆక్రమణదారులు వస్తున్నారా? కశ్మీర్లో లేరా? పహల్గాంలో దాడులు చేసింది ఎవరు? ఎర్రకోట ఉగ్రదాడి వెనుక ఎవరున్నారు? బెంగాల్‌నే ఆడిపోసుకుంటారెందుకు?' అని ప్రశ్నించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో జరుగుతున్న అతిపెద్ద కుంభకోణమే 'ఓటర్ల జాబితా ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) అని ఆరోపించారు. చట్టబద్ధమైన ఓటర్లలో ఒక్కరి పేరును జాబితా నుంచి తొలగించినా దిల్లీలోని ఈసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. "ఎస్ఐఆర్ పేరుతో రాష్ట్ర ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. దీని కారణంగా ఇప్పటికే 60 మంది మృతిచెందారు. పత్రాల పరిశీలన కోసం వృద్ధులను పిలుస్తున్నారు. ఇలాంటి వేధింపులను ప్రజలు సహించరు. పశ్చిమబెంగాల్‌లో భాజపా అధికారంలోకి రావడానికి వారు అనుమతించరు" అని ఆమె పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ 2025: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రత్యేక కథనం

ఒక కుటుంబంలో ఎంతమంది అర్హులైన పిల్లలున్నా, అందరికీ ఈ పథకం వర్తింపజేయడం విశేషం. మహిళా శక్తి (ఉచిత బస్సు ప్రయాణం): ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు 3.25 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయగా, ప్రభుత్వంపై ?1,144 కోట్ల భారం పడింది. దివ్యాంగులకు కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేశారు.అన్నదాత సుఖీభవ: రైతన్నలకు అండగా నిలిచేందుకు 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో ?6,310 కోట్లు జమ చేశారు. ఇది కేంద్రం ఇచ్చే సాయానికి అదనం.
దీపం-2: పేద మహిళలపై గ్యాస్ భారాన్ని తగ్గించేందుకు ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందించే పథకాన్ని ప్రారంభించారు. దీనికోసం ?2,684 కోట్లు వెచ్చించి, దాదాపు 2 కోట్ల సిలిండర్లను పంపిణీ చేశారు.వీటితో పాటు వివిధ వర్గాలకు ప్రత్యేక పథకాలను అమలు చేశారు. మత్స్యకార భరోసా కింద 1.25 లక్షల మందికి ?250 కోట్లు, ఆటో డ్రైవర్లకు ?436 కోట్లు అందించారు. పాస్టర్లు, ఇమామ్‌లు, మౌజన్‌లు, పురోహితులకు గౌరవ వేతనాలను పెంచారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలకు ?25,000, జూనియర్ లాయర్లకు ?10,000 గౌరవ వేతనం అందిస్తున్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం షాపుల్లో రిజర్వేషన్లు కల్పించారు. గతంలో మూతపడిన 204 అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి, 4 కోట్ల భోజనాలను అందించారు.

## ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాం: మంత్రి డీఎస్‌బీవీ స్వామి

ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తోందని చెప్పారు.ప్రతి ఇంటికీ సంక్షేమంతో సీఎం చంద్రబాబు.. దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రగతి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు.

## ఆలయాల్లో అపచారం జరిగితే ఉపేక్షించం: మంత్రి ఆనం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 31)
ఆలయాల్లో తప్పులు జరిగితే ఉపేక్షించబోమని, ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి హెచ్చరించారు. ద్రాక్షారామం, సింహాచలం, నంద్యాల ఘటనలపై ఆత్మకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఘటనలపై వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టామని, పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.
"కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం భీమేశ్వర ఆలయం వెలుపల శివలింగాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. ఆలయ సిబ్బందిపై కక్షతో అర్ధరాత్రి వేళ నిందితుడు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తేలింది. దేవాదాయ శాఖ అధికారులు వెంటనే ఆలయంలో నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. నంద్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వెండి వస్తువుల స్థానంలో నకిలీ వస్తువులు పెట్టిన విషయమై కర్నూలు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించాం. వెండి ఆభరణాలు తిరిగి స్వామివారికి చేరే వరకు తప్పు చేసినవారిని వదిలిపెట్టం. సింహాచలం అప్పన్న ప్రసాదంలో పురుగు రావడాన్ని గుర్తించి తెలిపిన భక్తుడితో దురుసుగా ప్రవర్తించిన ఆలయ ప్రసాదం కౌంటర్ ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈవోను ఆదేశించాం. ఇప్పటికే ఎఫ్ఐఆర్‌ను నమోదు అయింది. ఆలయాల పరిరక్షణ, సామాన్య భక్తుల భద్రత కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. గతంలో ఎన్నడూ లేని విధంగా ముక్కోటి ఏకాదశి రోజున దేవాలయాలకు భక్తులు భారీగా తరలి వచ్చారు" అని మంత్రి తెలిపారు.

## వైఎస్ఆర్ తెచ్చిన స్కీమ్‌కు.. మోదీ తెచ్చిన చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది: షర్మిల




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 31)
మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషితో, కాంగ్రెస్ హయాంలో ఈ చట్టానికి బీజం పడిందని, దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ పథకాన్ని ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.గత 20 ఏళ్లలో ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్లు నిధులు వచ్చాయని, పేదలకు అండగా నిలిచిన ఈ పథకానికి మోదీ ప్రభుత్వం 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకొచ్చిన కొత్త చట్టం తూట్లు పొడుస్తోందని షర్మిల విమర్శించారు.కాంగ్రెస్ తెచ్చిన చట్టానికి, బీజేపీ తెచ్చిన కొత్త చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు. కొత్త చట్టం ప్రకారం ఉపాధిని హక్కుగా కాకుండా, కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మార్చారని ఆమె మండిపడ్డారు. గ్రామసభలకు ఉండాల్సిన నిర్ణయాధికారాన్ని ఢిల్లీ చేతుల్లో పెట్టారని, 100 రోజుల పని దినాలను కుదించి, నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏడాదికి 60 రోజులు పని లేకుండా చేయడం, ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే పనులు కల్పించడం వంటి నిబంధనలు పేదలకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్రం ఈ కొత్త విధానాన్ని తెచ్చిందని విమర్శించారు. ఈ 'నల్లచట్టాన్ని' వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఏపీసీసీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, ఇతర పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## పారా క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తా మంత్రి నారాయణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 31)
పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణను పారా క్రీడాకారులు బుధ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంప్ కార్యాలయంలో మంత్రితో మాట్లాడారు. పారా క్రీడాకారులకు మున్సిపల్ శాఖలో ఉద్యోగావకాశాలు కల్పించి, అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి దివ్యాంగ పారా క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పారా స్పోర్ట్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు, కార్యదర్శి కటారి యాదగిరి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు · తెలుగు దినపత్రిక
ప్రకాశం



## జిల్లా ప్రకటనతో భాగోద్వేగానికి లోనై కంటతడి పెట్టిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)

ప్రసంగిస్తున్న సమయంలో జిల్లా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే కంటతడి పెట్టుకున్నారు. బాగోద్వేగానికి గురై మాట్లాడారు.పశ్చిమ ప్రకాశం చిరకాల వాంచేటువంటి మార్కాపురం జిల్లా కోసం గత 2019 ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 66 రోజులు పాటు జిల్లా కోసం జిల్లా సాధన కోసం దీక్షలు చేశారు. (తరువాయి 4లో...)

# ఇచ్చిన హామీకి కట్టుబడి అన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

### రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)

ఇచ్చిన హామీకి కట్టుబడి అన్ని ప్రాంతాల అభివ ృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. మార్కాపురం జిల్లా ఏర్పాటే దీనికి నిదర్శనమని అన్నారు. నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం పట్టణ శివారులోని ఆర్ అండ్ ఆర్ కాలనీలోని భవనములో ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఇన్చార్జి కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి వస్తున్న వీరికి స్థానిక ప్రజలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాలుస్తూ డప్పు వాయిద్యాలతో ఆహ్వానించారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్‌గా రాజాబాబు బాధ్యతలు స్వీకరించి ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. హామీ ఇచ్చిన మేరకు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, అదేవిధంగా వెలుగొండను కూడా పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడటం వలన అన్ని శాఖల ఉన్నతాధికారులతో పాటు ఎస్పీ, కలెక్టర్ కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టుతో పాటు ఇప్పటికే ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అడుగులు పడ్డాయి అన్నారు.

రానున్న రోజుల్లో అభివ ృద్ధి చెందిన ప్రాంతంగా మార్కాపురం మారుతుంది అన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ఏర్పడటం వలన శాంతిభద్రతలపై మరింత ద ృష్టి పెట్టే అవకాశం లభించింది అన్నారు. మొట్టమొదటి ఎస్పీగా తాను ఉండే అవకాశం రావడాన్ని అద ృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. దామచర్ల సత్య మాట్లాడుతూ భౌగోళికంగా వేరుపడినప్పటికీ అన్ని ప్రాంతాల అభివ ృద్ధి కోసం సమిష్టిగా ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లా కోసం 2 నెలలకు పైగా ఈ ప్రాంత ప్రజలు గతంలో పోరాడారని, అదే స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి కోసం (తరువాయి 4లో...)

## జిల్లా వచ్చింది... పేరు మారింది !








(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)

ప్రజల ఆకాంక్ష తీరింది. మార్కాపురం జిల్లా ఆవిష్కృతమైంది. అది ప్రతిబింబించేలా ప్రభుత్వ కార్యాలయాల పైనా పేరు మారింది. ఆ విషయం ప్రస్ఫుటించేలా రాష్ట్ర సాంఘిక సక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి రాజాబాబు, ఇంచార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధుల సమక్షంలో కార్యాలయాల పై ఉన్న జిల్లా పేరును అధికారులు మార్పించారు. మార్కాపురం తహసిల్దార్ కార్యాలయం, పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లపై ఉన్న 'ప్రకాశం జిల్లా'ను 'మార్కాపురం జిల్లా'గా మార్చారు. (తరువాయి 4లో...)

## మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)

మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాల యాన్ని బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంబి ంచారు. నూతన మార్కాపురం జిల్లా ఇంచార్జ్ ఎస్పీగా వి హర్షవర్ధన్ రాజు బాధ్యతలు స్వీకరించారు. నూతన మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో బుధవారం మార్కాపురం డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఇన్చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజుతో కలిసి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ పి రాజాబాబు, ఏపి మారి టైం బోర్డు దామచర్ల సత్య, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా మార్కాపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై నిరంతర నిఘా, గంజాయి, డ్రగ్స్ పూర్తిస్థాయి నిర్మూలన, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మహిళలు , చిన్నారుల భద్రతను మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నూతన జిల్లాకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర డీజీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధి ప్రజల (తరువాయి 4లో...)

## జిల్లా ప్రకటనతో భాగోద్వేగానికి లోనై కంటతడి పెట్టిన ఎమ్మెల్యే కందుల

అప్పటి ప్రభుత్వం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంత ప్రజల గురించి గానీ, ప్రాంత అభివృద్ధి గురించి గానీ ఏ మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లా సాధన కోసమే అనేక పార్టీ వాళ్లతోటి మరియు నియోజకవర్గాల ప్రజలతోటి పాదయాత్ర మరియు నిరాహార దీక్షలు చేశారు. కానీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు ప్రచారానికి వచ్చినప్పుడు మా కోరిక ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష జిల్లా ఏర్పాటు చేయాలని కోరగా హామీ ఇచ్చారు. అనంతరం 2024 సంవత్సరం కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం నర కాలంలోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయటం ప్రాంత ప్రజలు హర్ష0వ్యక్తం చేశారు. మార్కాపురం జిల్లా చేయడమే కాదు అభివృద్ధి కూడా చేసి చూపిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్న ఘనత దేశంలో కేవలం ఒక చంద్రబాబునాయుడు మాత్రమే అన్నారు. 2026వ సంవత్సరం నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## జిల్లా వచ్చింది... పేరు మారింది !





**పెన్షన్లు పంపిణీ...**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను అధికారులు పంపిణీ చేశారు. పట్టణంలోని కోర్టు సెంటర్లో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తో పాటు కలెక్టర్ పి రాజాబాబు, ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీకి కట్టుబడి అన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది























పాటుపడాలని కోరారు. మార్కాపూర్ అని కాకుండా, అభివృద్ధి ప్రతిధ్వనించేలా ఇకనుంచి మార్కా'పురం' అని పిలుచుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లాను 'చంద్రన్న మార్కాపురం జిల్లా'గా పేరు మార్చేలా అందరూ మరోసారి కృషి చేయాలని ఆయన కోరారు. అధికార యంత్రాంగానికి ప్రజలందరూ సహకరిస్తారని, అదే విధంగా జిల్లా అభివృద్ధికి అధికారులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని ఆయన కోరారు. వెలుగొండ ప్రాజెక్టును కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అక్కడ తాను గుడి కట్టిస్తానని ప్రకటించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిపాలన కేంద్రం అందుబాటులో ఉండటం వలన ప్రభుత్వ సేవలు, అభివృద్ధి వేగవంతమవుతాయన్నారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. వివిధ ప్రాజెక్టులకు నిధులు కేటాయించేలా చూడడమే దీనికి నిదర్శనం అన్నారు. వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి కూడా వలస కూలీలు ఎక్కువగా ఉంటున్నారని, నూతనంగా జిల్లా ఏర్పడటం వలన ఈ పరిస్థితిలో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డిఆర్ఓ బి చిన ఓబులేసు, మార్కాపురం ఇన్చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్,పలు శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా అభివృద్ధి పథంలో నడిచేలా పనితీరు పై ఆయన దిశా నిర్దేశం చేశారు.

## ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 31)**

స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకొని సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తి పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుంది. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండో బహుమతి 50 వేల రూపాయలు, మూడో బహుమతి 25 వేల రూపాయలు ఇవ్వబడుతుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ,బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్మెన్ బహుమతులు ఇవ్వబడును. ప్రతి టీమ్ కు ఎంట్రీ ఫీజు 2000 రూపాయలు చెల్లించవలెను. ఆసక్తి గలవారు దిగువ ఇచ్చిన ఫోన్ నెంబర్లను సంప్రదించవలెను. 2.1.2026 లోపు టీముల ఎంట్రీలు నమోదు చేయించుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం 04.01.2026 న మ్యాచులు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు వై సురేష్ 9704112567, జి తిరుమల 8884344595, పి శ్రీను 9502988777, జి సుమంత్ 9603172235 లను సంప్రదించాలన్నారు.

## మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

భద్రత కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కార చర్యలు చేపడతామన్నారు. మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి బాధితుడికి తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గుట్కా, గంజాయి, నాటు సారా వంటి అసాంఘిక కార్యకలాపాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం పరిసర ప్రాంతాలు, పాత బిల్డింగ్, పాత పోలీస్ క్వార్టర్స్‌లను పరిశీలించి, పోలీస్ పరిపాలన కార్యాలయాలకు ఉపయోగపడేలా యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి మార్కాపురం పట్టణంలోని పట్టు పరిశ్రమ శాఖ, ఎస్‌వీకేపీ కళాశాల పరిసరాలను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు. నాగరాజు, ఎస్బీ డీఎస్పీ చిరంజీవి, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, మార్కాపురం సీఐ సుబ్బారావు, త్రిపురాంతకం సీఐ అసన్, కనిగిరి సీఐ శ్రీనివాసులు, వైపాలెం సీఐ అజయ్ కుమార్, పామూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.









# ప్రజలకు మరింత చేరువగా పాలనను తేవాలి

## అందుకే రాష్ట్రంలో కొత్త జిల్లాలు
## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 31)**

ప్రజలకు మరింత చేరువగా పాలనను తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో కొత్తగా కొన్ని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. ప్రకాశం జిల్లాలో నూతనంగా అద్దంకిలో ఏర్పాటు చేసిన అద్దంకి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంను బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు పాలనను మరింతగా చేరువ చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కొన్ని జిల్లాలను, రెవెన్యూ డివిజన్లను, మండలాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలో అద్దంకి నియోజకవర్గాన్ని కలుపుతూ దర్శి నియోజకవర్గం లోని మండలాలను కూడా చేరుస్తూ మొత్తం 10 మండలాలతో కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రకాశం జిల్లా నుండి వేరుచేస్తూ కొత్తగా మార్కాపురం జిల్లా ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రోజు ఉదయం మార్కాపురం జిల్లా ఇంచార్జి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకోవడం జరిగిందన్నారు. అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడంతో డివిజన్ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గర అవడంతో పాటు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుతుందన్నారు. పిజిఆర్ఎస్ లో వచ్చే వినతుల్లో ఎక్కువ శాతం రెవెన్యూ సమస్యలపై రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29 నుండి జిల్లా కేంద్రంలో రెవెన్యూ క్లినిక్ లను ఏర్పాటు చేసి సత్వరమే రెవెన్యూ సమస్య ల పరిష్కారానికి కృషి చేయడం జరుగుచున్నదన్నారు. త్వరలో డివిజన్ స్థాయిలో కూడా రెవెన్యూ క్లినిక్ లను ఏర్పాటు చేసి రెవెన్యూ సమస్య ల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పాలనను దగ్గరకు చేరుస్తూ, ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కారం చూపుతూ ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీ రాజాబాబు, ఇంచార్జి రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ ప్రసన్న తో కలిసి డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో సమావేశమై పాలనా విధానం పై దిశానిర్దేశం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం పై జిల్లా పేరు మార్పును పర్యవేక్షించారు.



# పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి









**(షణ్ముఖ వెలుగు, పర్చూరు ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)**

పేదల సంక్షేమం కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారులకు నగదు పంపిణీ కార్యక్రమం ఇంకొల్లు మండలం ఇంకొల్లు పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగింది. అనంతరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో రూ.నాలుగు లక్షలతో దాతలు నిర్మించిన నూతన వేదికను కలెక్టర్ వినోద్ కుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు కలిసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. పేదలు, నిరుపేదలను సంరక్షించడానికే పింఛన్ పథకాన్ని ప్రభుత్వం సమర్ధంగా అమలు చేస్తుందని కలెక్టర్ చెప్పారు. వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు విస్మరించరాదని సూచించారు. పింఛన్ పంపిణీ సమయంలోనైనా తల్లిదండ్రులను పరామర్శించాలన్నారు. నూతన సంవత్సరంలో జిల్లాలలో మార్పులు వచ్చాయన్నారు. బాపట్ల జిల్లా 20 మండలాలకు చేరడం, అద్దంకి నియోజకవర్గంలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా కొనుగోలు చేసిందన్నారు. మిగిలిపోయిన మరికొంత పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. గడిచిన నష్టాలను చూసిన రైతులు ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్నకు మంచి గిట్టుబాటు ధరలు ఉన్నాయన్నారు. పత్తి రైతుల సమస్యను పరిష్కరించి గుంటూరులోని పత్తి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. బ్లాక్ బర్లీ పొగాకును రైతులు సాగు చేయరాదని, ప్రభుత్వం ప్రకటించిన తదుపరి సాగు చేసుకోవాలన్నారు. ఆర్ ఎస్ కేలు, రైతు సహకార సంఘాల వద్ద యూరియా అందుబాటులో ఉందన్నారు. ఏ మండలంలో రైతులకు భూములు ఉంటే ఆ మండలాల్లోనే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. మార్టూరు మండలంలో ఎం.ఎస్.ఎమ్.ఈ. పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంకొల్లు మండలంలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రతి నెలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నిటిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్ధంగా అమలు చేస్తున్నారని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. కూటమి పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పేదల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. జనవరి ఒకటో తేదీన ప్రజలంతా వేడుకల్లో ఉంటారనే ఉద్దేశంతో ముందుగానే పింఛన్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఆటోనగర్, ఫెసిలిటేట్ సెంటర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా ఎత్తిపోతల పథకం కింద తాగునీటి అవసరాల కొరకు పంచాయితీ నుంచి రూ.ఎనిమిది లక్షల నిధులను ఖర్చు చేస్తున్నారని వివరించారు. శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పర్చూరు ఇంకొల్లు రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు. బ్లాక్ బర్లీ పొగాకు మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, ఇలాంటి పరిస్థితి మరోసారి రాకుండా చూడాలన్నారు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు వాణిజ్య పంటలు వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, ఉప కలెక్టర్ లవన్న, మండల ప్రత్యేక అధికారి శాఖ సహాయ సంచాలకులు రమేష్ బాబు, ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## అవ్వ, తాతలకు అండగా ఉండడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
### కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)**

మార్కాపురం పట్టణంలోని 33 వ వార్డులో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి అవ్వ తాతలకు దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవ్వ తాతలు దివ్యాంగులు ఇబ్బందులను గుర్తించి మాట తప్పని మడమతిప్పని నాయకుడు... నారా చంద్రబాబునాయుడు అని మేనిఫెస్టో చెప్పిన మాట ప్రకారం పెన్షన్ పెంపు అవ్వతాతలకు ఆసరాగా ఉందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రతినెల 1వ తారీకు ప్రతి ఇంటికి వెళ్లి అవ్వ తాతల యోగక్షేమాలు తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చలవాది వెంకటేశ్వర్లు, చౌదరి వెంకటేశ్వర్లు, కందుల రాజశేఖర్ రెడ్డి, ఏరువా శివారెడ్డి, , చిట్యాల వెంకటరెడ్డి, అల్లూరయ్య, ఎస్కే భాషలు పాల్గొన్నారు.

## 23వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)**

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశాల మేరకు నగరంలోని 23వ డివిజన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ టిడిపి నాయకులు సచివాలయం సిబ్బందితో కలిసి పాల్గొని పింఛన్ దారులకు పింఛన్ లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కానుకగా ఒక రోజు ముందే పింఛన్ లను కూటమి ప్రభుత్వం అందజేసిందని, ఉదయం 7 గంటల నుండే సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ శ్రేణులు పింఛన్ లను పంపిణి చేశారు. రాబోయే కొత్త సంవత్సరం మరియు సంక్రాంతి పండుగ ముందు పెన్షన్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని , పండుగ ఖర్చులకు కూడా మాకు ఎంతో ఉపయోగపడుతుందని పెన్షన్ దారులు తెలపటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం , ఒంగోలు పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి గోపు వీరాంజనేయులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి కుంచాల హనుమంతరావు, డివిజన్ ఉపాధ్యక్షులు షేక్ అక్బర్ బాషా, డివిజన్ 106 బూత్ ఇంచార్జి షేక్ అష్రఫ్ అబ్దుల్లా, 107 బూత్ ఇంచార్జి పబ్బిశెట్టి రాము, 107 బూత్ కో కన్వీనర్ వాయల మల్లిఖార్జున, సచివాలయం అడ్మిన్ నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువుగా పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
### టిఎన్‌టిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)**

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశానుసారం స్థానిక 34వ డివిజన్ నందు బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ జరిగింది. ప్రతినెలా ఒకటో తేదీని పెన్షన్ రూ.4వేలు ఒకరోజు ముందుగా పెన్షన్ ఇవ్వడంతో పెన్షన్ లబ్ధిదారులు ఆనందం వ్యక్తపరిచారు. పార్టీ నాయకులు లబ్ధిదారులకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటామని పెన్షన్ లబ్ధిదారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 9వ క్లస్టర్ కన్వీనర్ పాడిబండ్ల వెంకటేశ్వర్లు, 34వ డివిజన్ అధ్యక్షులు షేక్ బడే సాహెబ్, సచివాలయం సిబ్బంది హుమర్ పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక ఆఫర్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)**

నూతన సంవత్సర 2026 సందర్భముగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బి.యస్.యన్.యల్) జనవరి 01 నుండి జనవరి 31, 2026 వరకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌సీ 1 ఫ్రీడం ప్లాన్' మళ్లీ ప్రారంభించబడింది. కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ఈ ప్లాన్‌లో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జిబి డేటా, రోజుకు 100 మెసేజీలు, ఉచిత సిమ్ కార్డు అందించబడుతుంది. ఈ ఆఫర్ ఎం.యన్.పి. వినియోగదారులకు కూడా వర్తిస్తుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కార్డు కావలసిన వారు తమ దగ్గరలోని బి.యస్.యన్.యల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

# యర్రగొండపాలెంలో పింఛన్ పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 31)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీను వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా పేద, బలహీన వర్గాల సంక్షేమం దృష్ట్యా వృద్ధులకు, విధవలకు, ఒంటరి మహిళలకు, చేపల కార్మికులకు, కళాకారులకు నెలకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 వరకు పింఛన్ అందే విధంగా ప్రభుత్వం పథకాన్ని బలోపేతం చేసింది. అత్యంత తీవ్ర రోగాలతో మంచాన పడినవారికి మరింత ఎక్కువ మొత్తంలో పింఛన్ అందజేస్తూ, ఎవరు బ్యాంకులకు, సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా ఇంటికే చేరేలా ఈ సేవలను విస్తరిస్తోంది. ఈ సందర్భంగా నక్కా శ్రీను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల చేతికి పింఛన్ అందజేస్తూ, “పింఛన్ అనేది కేవలం డబ్బు కాదు, ప్రభుత్వం అందిస్తున్న భరోసా, ఆపన్నహస్తం” అనే భావంతో ప్రతి వ ృద్ధుడు, వికలాంగుడు ఆర్థికంగా, భావోద్వేగంగా అండగా నిలుస్తామన్నారు. ఇంటివద్దకే పింఛన్ చెల్లింపు ద్వారా బారులు తీరడం, మధ్యవర్తుల జోక్యం, వ ృద్ధులు పడే ఇబ్బందులు తగ్గాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేసి, నారా చంద్రబాబు నాయుడుకి ప్రభుత్వానికి కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు.

# పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దాదా





**(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 31)**

గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశానుసారం కంభం గ్రామపంచాయతీ పరిధిలోని జుమ్మా మసీద్ సెంటర్ చిన్న మసీద్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అతార్ షేక్ హుస్సేన్ (దాదా) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పటాన్ నాగుర్ వలి ఖాన్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

# బలిజ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



## పూలమాలలు - శాలువాలు వద్దు పుస్తకాలు - పెన్నులే ముద్దు అనే నినాదం

**(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 31)**

పట్టణంలోని కందులాపురం సెంటర్ నందు గల బలిజ సేవా సంఘం పిలుపుమేరకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి బలిజ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొని గిద్దలూరు నియోజకవర్గం కంభం మండల ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని దేవుణ్ణి మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నానన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వం పై ఎంతో నమ్మకం కలిగి ఉన్నారని, వాళ్ళ నమ్మకాలను, కోరికలను తీర్చే విధంగా కూటమి ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీలు అన్నీ నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగుతుందని, ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురంను జిల్లా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యం అయిందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు నూతన సంవత్సరం గురించి మంచి సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గిద్దలూరు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ఆదర్శవంతమైన నిరయం తీసుకున్నారు. జనవరి 1న తనకు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు, అధికారులు ఎవరూ కూడా పూలమాలలు, శాలువాలు, బొకేలు తీసుకురావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. పూలమాలలు, శాలువాల కోసం వ ృధాగా ఖర్చు చేసే బదులు, ఆ మొత్తంతో పుస్తకాలు మరియు పెన్నులు తీసుకురావాలని ఆయన కోరారు. ఇలా సేకరించిన విద్యా సామాగ్రిని నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పంపిణీ చేద్దామని ఆయన తెలిపారు. శుభాకాంక్షలు తెలిపే వారు ఇచ్చే “ఒక్క పుస్తకం - ఒక పెన్ను” ఒక పేద విద్యార్థి చదువుకు ఎంతో ఉపయోగపడు తుందని ఆడంబరాల కంటే అక్షర రూపంలో చేసే ఈ సాయం చిరస్థాయిగా నిలిచి పోతుందని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ వేడుకలను సామాజిక బాధ్యతగా మార్చటం అనవసరమైన పూలమాలలు, శాలువాల ఖర్చును తగ్గించడం ద్వారా నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలువవచ్చునన్నారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పై నియోజకవర్గ ప్రజలు మరియు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఈ పిలుపును గౌరవించి, విద్యా వితరణలో భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులను, ప్రజలను కోరారు. ఆడంబరాలకు పోకుండా పేద విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించడం ఆయన సేవా ద ృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.

**పుస్తకాలు పెన్నులతో శుభాకాంక్షలు తెలుపుదాం.**

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామని పేద విద్యార్థులకు సహకారం అందిద్దామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు, కంభం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,



# కుంచేపల్లి, దాసళ్ళపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 31)**

మండలంలోని కుంచేపల్లి, దాసళ్ళపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ రబీ 2025-26లో సాగులో ఉన్న ప్రతి పంటను గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలిపి వెంటనే ఈ పంట నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు. ఉద్యాన వన శాఖ అధికారి ధనలక్ష్మి దానిమ్మ తోటను పరిశీలించారు. తోటలో కలుపు లేకుండా కలుపు యాజమాన్యం చేసుకోవాలని సూచించారు. దానిమ్మలో తామర పురుగు రసం పీల్చడం వలన కాయల మీద గార లాంటి గరుకు మచ్చలు కనిపిస్తున్నాయని, దీనిని నివారించడం కోసం మొగ్గలు తొడిగే దశలోనే డైమిథోఏట్ లేదా ఫిప్రోనిల్ లీటర్ నీళ్లకు రెండు మి.లీ కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. దానిమ్మలో ముఖ్యంగా శిలీంద్ర మచ్చ తెగులు వలన కాయల పైన మచ్చలు ఏర్పడి ఒకదానితో ఒకటి కలిసి పెద్ద మచ్చగా మారి దీనివల్ల కాయల నాణ్యత కోల్పోవడం జరుగుతుందన్నారు. దీని నివారణ కోసం మచ్చలను గమనించిన వెంటనే మ్యాంకోజబ్ 2.5 గ్రాములు లేదా 3 గ్రాములు కాపర్ ఆక్సి క్లోరైడ్ 15 నుండి 20 రోజులవ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేయాలని సూచించారు. దానిమ్మ తోటల్లో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు అధిక నష్టాన్ని కలుగ చేస్తుందని దీని నివారణ కోసం కాపర్ సంబంధిత తెగులు మందులను కోవాలని, 1% బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.




# రసాయనిక ఎరువులు తగ్గించాలి




**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 31)**

మండలంలోని చౌటపాలెం గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారి వీ రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ నిర్మలకుమారి మాట్లాడుతూ కంది, సెనగ పంటలలో రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి రాము మాట్లాడుతూ రసాయనిక ఎరువులను తగ్గించి పచ్చి రొట్టె ఎరువులను వేసుకొని భూమిలో సేంద్రీయ కర్బనం పెంచుకోవాలని, అలాగే ఒకే పంట మీద ఆధారపడకుండా ఆదాయం వచ్చే చిరు ధాన్యాలను పండించుకోవాలని రైతులకు సూచించారు. ఎరువులకు బదులు నానో యూరియా, నానో డిఏపి వాడాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కే సుప్రజ, పక ృతి వ్యవసాయ సిబ్బంది టీ మందాకిని, ధనలక్ష్మి, కవిత, అనూష, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం కావాలి






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)**

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం కావాలని మోటార్ సైకిల్ ర్యాలీ , ఎర్ర బెలూన్స్ ఎగరేయడం జరిగింది. స్థానిక నెల్లూరు బస్టాండ్ యూనియన్ బ్యాంక్ నుండి కలెక్టరేట్ ,చర్చి సెంటర్ ,ట్రంక్ రోడ్, మస్తాన్ దర్గా , అద్దంకి బస్టాండ్ ఒంగోలు డిపో వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. మోటర్ సైకిల్ ర్యాలీని సిఐటియు సీనియర్స్ జి.నరసయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు కాల సుబ్బారావు మాట్లాడుతూ 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత్ మహాసభల జరుగుతున్నాయి. ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై చర్చించటమే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థల కాపాడాలని, ప్రవేటీకరణ వ్యతిరేకంగా, విశాఖ స్టీల్ ప్లాంట్ ని కాపాడుకోవడానికి రానున్న రోజుల్లో సమస్యల పోరాటాలకు, విశాఖ నగరంలో సిఐటియు అఖిలభారత మహాసభలో వేదిక కాదన్నయని తెలియజేశారు. రానున్న రోజుల్లో ఉద్యోగ ,కార్మికుల ,ప్రజలు అందరూ ఐక్య పోరాటానికి పిలుపునిచ్చారు. జనవరి 4వ తారీఖున ఉద్యోగులు కార్మికులు వేలాదిగా బహిరంగ సభకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు ,సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్, నగర నాయకులు బి వి రావు, జి రమేష్, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, మున్సిపాలిటీ నాయకులు కె శ్రీనివాసరావు, విజయ్, కె గోపి, ఆర్ శ్రీనివాసరావు, అనిత, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం అయ్యప్పరెడ్డి, ఒంగోలు డిపో నాయకులు యు హరిబాబు, ఎస్ రవి, డి ఏడుకొండలు, ఎస్ కె హుస్సేన్, పెన్షనర్ సంఘం నాయకులు ఎన్ వీరాస్వామి, సిహెచ్ రాంబాబు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, మెడికల్ రిప్రజెంట్ యూనియన్ నాయకులు క ృష్ణమోహన్, బిల్డింగ్ రంగం యూనియన్ నాయకులు భవన్ నారాయణ, ఆటో యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరుకు కొత్త వెలుగులు



పామూరు రోడ్డులో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
రూ.2 కోట్లతో పూర్తయిన పనులు
మున్సిపాలిటీకి త్వరలో ఎన్నికలు
32 వార్డులు గెలుచుకుంటామని ధీమా
అభివృద్ధి చేశాకే 2029లో ఓట్లు అడుగుతామని స్పష్టం చేసిన ఎమ్మెల్యే









(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 31)

కందుకూరు మున్సిపాలిటీకి త్వరలో ఎన్నికలు జరుగుతాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పట్టణంలో 32 వార్డులు గెలిచి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కందుకూరు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు జంక్షన్ వరకు రూ.2 కోట్ల రూపాయలతో చేపట్టిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా సెంట్రల్ లైటింగ్ వెలుగులతో పామూరు రోడ్డు కళకళలాడింది. ప్రజలంతా పెద్ద ఎత్తున చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ వెలుగులను స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ గారు ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు గారు కందుకూరుకు వచ్చినప్పుడు 50 కోట్లు ప్రకటించగా, ఇప్పటికే 20 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. మాట తప్పని మడమ తిప్పని నాయకుడని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి, కందుకూరు అభివృద్ధికి 20 కోట్లు ఇస్తామని చెప్పి ఒక పైసా కూడా విదిల్చలేదని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. కందుకూరు అభివృద్ధికి నిజంగా పాటుపడుతున్నది ఎవరో ఇకనైనా ప్రజలు గమనించాలని కోరారు. కందుకూరును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేవరకు నిరంతరంగా పనిచేస్తూనే ఉంటానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాతే 2029 ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడుగుతానని చెప్పారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో కందుకూరు నియోజకవర్గం త్వరలో పారిశ్రామిక కేంద్రంగా మారబోతుందని ఎమ్మెల్యే నాగేశ్వరావు వివరించారు. రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా ఇండోసోల్ పరిశ్రమ ఇప్పటికే పనులు ప్రారంభించగా, లక్ష కోట్లతో బిపిసిఎల్ రిఫైనరీ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గంగా నెల్లూరు జిల్లాలో కలిపిన సందర్భంగా పెద్ద ఎత్తున ఇక్కడ ప్రజలు ఆందోళనలు, పోరాటాలు చేశారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. అయినప్పటికీ జగన్ మనసు కరగలేదని, గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరిగి కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. యువగళం పాదయాత్రలో కూడా లోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని తెలిపారు. కూటమి ప్రభుత్వ సహకారంతో కందుకూరుకు న్యాయం జరిగిందని, ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, డివిజనల్ పోలీస్ అధికారి వి బాలసుబ్రమణ్యం, మున్సిపాలిటీ డి ఈ గణపతి, కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృషా?రెడ్డి, వలేటివారిపాలెం మండలం పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, రాష్ట్ర విద్య మరియు మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, నెల్లూరు పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, కాంట్రాక్టర్ గొంది నరసింహారావు, గల్లా శ్రీనివాసరావు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, కల్లూరి శైలజ మరియు అన్ని వార్డు అధ్యక్షులు కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బీద రవిచంద్రకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 31)

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమితులైన బీద రవిచంద్ర ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈరోజు నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా రవిచంద్రని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చేజర్ల వెంకటేశ్వరరెడ్డిని కూడా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎంపి మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)

జాతి, మత, కుల, వర్గ విభేదాలకు అతీతంగా ప్రపంచ ప్రజలందరు నూతన సంవత్సర పండుగను జనవరి 1 వ తేదీన ఏంతో ఘనంగా జరుపుకొంటారు. 2026 నూతన సంవత్సరంలో ప్రజలందరు చైతన్యవంతులై మంచి నిర్ణయాలతో వృత్తిపరంగా మరియు వ్యక్తిగతంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుచున్నాను. ఈ 2026 నూతన సంవత్సరంలో ప్రకాశం జిల్లా ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, భోగభాగ్యాలు కలగాలని, నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 31)

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, అష్టైశ్వర్యాలతో తలతూగాలని జిల్లాలోని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పార్టీ శ్రేణులకు అన్ని వర్గాల ప్రజానీకానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు

పోతినేని శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)

సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్ గారికి, మద్దిపాడు మండల ప్రజలందరుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు, నూతన సంవత్సర పండుగను జనవరి 1 వ తేదీన ఏంతో ఘనంగా జరుపుకొంటారు. 2026 నూతన సంవత్సరంలో ప్రజలందరు చైతన్యవంతులై మంచి నిర్ణయాలతో వృత్తిపరంగా మరియు వ్యక్తిగతంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుతూ ఈ 2026 నూతన సంవత్సరంలో ప్రకాశం జిల్లా ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, భోగభాగ్యాలు కలగాలని, నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని కోరుచూ మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు.

## ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 31)

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం 2025 సంవత్సరంలో జిల్లాలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు, యువతకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో రోడ్లు, ప్రజలకు త్రాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పచ్చదనం, పరిశుభ్రత పెంపునకు చర్యలు చేపట్టాం. ప్రకాశం జిల్లాకి జీవ నాడి అయిన వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చేసాం. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబు నాయుడు పశ్చిమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారం చేశారు. 2026లో ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరింత కృషి చేస్తుంది. కొత్త సంవత్సరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలి. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి. నూతనోత్సహంతో కొత్త అవకాశాలను అన్వేషించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

# పార్టీ కోసం పాటుపడిన వారికి ప్రశంసా పత్రాలు అందజేత



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 31)

తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తూ పార్టీ చేపట్టే పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న వారికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ప్రశంసా పత్రాలు అందించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఉత్తమ కార్యకర్తలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 2025 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం సాధించిన కీలక విజయాలను మీడియాకు వివరించారు. 2025లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు తదితర అంశాల గురించి వివరించారు . ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, ప్రశంసా పత్రాలు పొందిన వారిలో రాగి మాను ప్రతాప్ కుమార్, షేక్ మహబూబ్ బాషా, నాగభూషణం, ప్రశాంత్, తుడిమెల్ల సుదర్శన్, మస్తాన్ బాబు, జహంగీర్ భాష ,ఎస్ఎం బాషా, తదితరులు ఉన్నారు.







# పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ నెంబర్ 1

## సమాజంలో అంతరాలు తగ్గించేందుకే పీ4
## కూటమి ప్రభుత్వంలో గ్రామ స్థాయిలో అభివ ృద్ధి
## 20 లక్షల ఉద్యోగాల కల్పనలో ముందంజ
## దాతల సహాయంతో 6 వేలకు పైగా సైకిళ్ల పంపిణీ
## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్











**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 31)**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సమాజంలో అంతరాలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గం, జే.పంగలూరు మండలం నూజెళ్లపల్లిలో బుధవారం నాడు మంత్రి గొట్టిపాటి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఆయన, వారి కష్ట సుఖాలు అడిగి తెలుసు కున్నారు. పేదల పెన్షన్ ను వెయ్యి పెంచడానికి వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల సమయం తీసుకుంటే సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో పెన్షన్ ను ఒకేసారి వెయ్యి రూపాయిలు పెంచారని తెలిపారు. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి అత్యధికంగా నెలకు రూ.15,000 అందిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సుమారు 65 లక్షల మందికి సామాజిక పెన్షన్లు ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. డిఎస్సీ ద్వారా 16,300 టీచర్ పోస్టులతో పాటు, 6 వేల పోలీస్ ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం భర్తీ చేసి 20 లక్షల ఉద్యోగాల కల్పనలోనూ రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు. గడిచిన సంవత్సరంన్నర కాలంగా రాష్ట్రంలో గ్రామ స్థాయిలో ఎంతో అభివ ృద్ధి జరుగుతున్నా., కూటమి ఏం చేసిందని జగన్మోహన్ రెడ్డి సిగ్గు లేకుండా ప్రశ్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజెళ్లపల్లిలో పింఛన్ల పంపిణీ అనంతరం పలు అభివ ృద్ధి కార్యక్రమాలను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ముందుగా రూ.20 లక్షలతో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను ప్రజలకు అంకితం చేశారు. రూ.5 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం దాతలు ఇచ్చిన 46 సెంట్లను ఎస్సీ కాలనీ స్మశాన వాటికకు అందజేశారు. అదే విధంగా దాతల సహాయంతో రూ.9 లక్షలతో నిర్మించిన ఆడిటోరియాన్ని మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన నూజెళ్లపల్లి తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని మంత్రి గొట్టిపాటి., పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., గతంలో కులమతాల మధ్య అసమానతలు ఉండేవని, వాటిని పోగొట్టడానికి డా.బీఆర్ అంబేద్కర్ ఏ విధంగా క ృషి చేశారో... పీ4 కార్యక్రమం ద్వారా సీఎం చంద్రబాబు అదే విధంగా క ృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నీ ప్రభుత్వం మీద ఆధారపడకుండా.. ఆర్థికంగా బలంగా ఉన్న వారు ఆసరా ఇచ్చి సేవ చేస్తే... రాష్ట్రంలో గ్రామాలన్నీ బాగుపడి అభివ ృద్ధి చెందుతాయని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. అద్దంకి పరిధిలో ఇప్పటికి 20కిపైగా కమ్యూనిటీ హాళ్లు సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పీ4 కార్యక్రమంలో అవకాశం ఉన్న మరింత మంది భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

**విద్యార్థులకు ఉచితంగా 6 వేల సైకిళ్ల పంపిణీ...**
కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గం జే.పంగలూరు మండలంలోని నూజెళ్లపల్లిలో ఎంపీపీ పాఠశాల, అలవలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ లోని 130 మంది విద్యార్థినీ, విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి బుధవారం ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకి పరిధిలో ఇప్పటికే సుమారు 6 వేల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందించినట్లు వెల్లడించారు. అవకాశాలను వినియోగించుకుని పోటీగా చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన విద్యార్థులను దీవించారు. గత వైసీపీ ప్రభుత్వానికి భిన్నంగా కూటమిలో ప్రభుత్వ విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మంచి పుస్తకాలు, బ్యాగు, అందించామన్నారు. అదే విధంగా పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**అద్దంకి రెవిన్యూ డివిజన్ ప్రారంభం...**
అద్దంకి ప్రజల చిరకాల వాంఛ అద్దంకికి ప్రత్యేక రెవిన్యూ డిజిజన్ కేటాయించడంపై 15 సంవత్సరాల కల సాకారమైందని మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు. అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలపడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. దీనికి సహకరించిన సీఎం చంద్రబాబుతో పాటు పాదయాత్ర హామీని నెరవేర్చిన మంత్రి లోకేష్ కు, మంత్రి వర్గ ఉప సంఘం సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. బుధవారం అద్దంకి ఆర్డీఓ కార్యాలయం ప్రారంభం సందర్భంగా పలువురు అధికారులు మంత్రి గొట్టిపాటిని మర్యాదపూర్వకంగా కలిసారు. అద్దంకి రెవిన్యూ డివిజన్ ఏర్పాటు, అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలపడం పట్ల ప్రజలు సంబరాలు చేసుకున్నారు. అద్దంకి మండలంలోని మణికేశ్వరంలో సీఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి చిత్ర పటాలకు అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.

## చెరువుకొమ్మిపాలెం అంగన్వాడి కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 31)**
మండలంలోని చెరువుకొమ్మి పాలెం అంగన్వాడి కేంద్రంలో బుధవారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పి కోటేశ్వరమ్మ , కవిత, చిన్నారి తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసిన మంత్రి స్వామి





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 31)**
ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా వ ృద్ధులు వికలాంగులు కార్మికులు వితంతువులు వ్యాధిగ్రస్తులకు తదితర బలహీన వర్గాల వారికి బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పెన్షన్ ను పంపిణీ చేశారు. మండలంలోని రాజోలపాడు, కొత్తపాలెం, కే అగ్రహారం గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి స్వామి పెన్షన్ పంపిణీ చేశారు. కే అగ్రహారం గ్రామంలో శివాలయం సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం అయ్యిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 63.12 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రూ 2,743 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ హిమ వంశి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండల టిడిపి నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు రమేష్ బాబు, మండల మురళీమోహన్, సర్పంచ్ చిన్న మస్తాన్, పిల్లి వెంకట్ నారాయణ, పసల రమణయ్య, ఉన్నం శ్రీనివాసరావు, పిల్లి కృష్ణారెడ్డి, అనుమోలు సుధాకర్, కోటిరెడ్డి, చక్రవర్తి, తాసిల్దార్ వి పుల్లారావు, ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 31)**
ఉలవపాడు మండలం కూటమి పార్టీ కుటుంబ సభ్యులకు నాయకులకు, కార్యకర్తలకు, మండల ప్రజలకు. అందరికీ. నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఉలవపాడు మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, నూతన సంవత్సరము నుంచి ప్రజలందరికీ మేలు, అందరికి శుభం జరగాలని భగవంతుడిని కోరుకుంటూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## వాసవి పెనుగొండ గ్రామంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)**
ఒంగోలు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బిశెట్టి భాస్కర్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం అయినటువంటి పెనుగొండ గ్రామానికి వాసవి పెనుగొండ గ్రామంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వరరావు, జిల్లా వాణిజ్యభాగం అధ్యక్షులు కొప్పురావూరి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులు, రాష్ట్ర సేవాద అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, తాత ప్రసాద్, కొల్లిపల్లి సురేష్, మిరియాల కృష్ణమూర్తి, చీదెండ్ల ఉమామహేశ్వరరావు, వేముల తిరుమల, ఒంగోలు నగర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శిఖాకొల్లి సత్యనారాయణ, పబ్బిశెట్టి సురేష్, కొప్పురావూరి హరి, నల్లమల్లి శేషు, శిఖాకొల్లి శివప్రసాద్, లహరి ప్రసాద్, సుంకు రఘు, తూము రాజేష్, బచ్చు సురేష్, గ్రంధి పార్ధు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు





## వైకల్యం విజయానికి అడ్డంకి కాదు




**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, డిసెంబర్ 31)**
వైకల్యం విజయానికి అడ్డంకి కాదు అని శారీరక లేదా మానసిక వైకల్యం ఉన్నప్పటికీ, సరైన సంకల్పం, పట్టుదల, సృజనాత్మకత ఉంటే ఎవరైనా తమ లక్ష్యాలను సాధించగలరని మండల విద్యాధి కారి అజయ్ బాబు అన్నారు. బాపట్ల జిల్లా స్థాయిలో మంగళ వారం నిర్వహించిన పాటల, డాన్స్ పోటీలలో మండలంలోని చిన్నగంజాం ఎంపీపీ-ఎస్ మెయిన్ స్కూల్కి చెందిన లోకో మోటార్ డిజిబిలిటీ కల షేక్ నిహా సుల్తానా సోలో డాన్స్ పోటీల్లో మొదటి బహుమతి సాధించి జిల్లా సమన్వయకర్త మట్ట జోష్నా చేతుల మీదుగా బహుమతి అందుకున్న సందర్భంగా బుధవారం మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయల సమక్షంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ అజయ్ బాబు, ఉపాధ్యాయులు నిహా సుల్తానా ఆత్మస్థైర్యాన్ని అభినందించి భవిషత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్టిలు టి బాలకృష్ణ, డి నాగార్జున, ఆయా కె రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

# వైశ్యుడిని కొట్టిన ఎస్ఐని వి ఆర్ కు పంపి, మాదిగల్ని కొట్టిన ఎస్ఐ మీద చర్య తీసుకోకపోవటం కూటమి ప్రభుత్వ కుల వివక్ష

## వైశ్యుడ్ని పరామర్శించిన హెూంమంత్రి అనితకు, మాదిగల్ని పరామర్శించే తీరిక లేదా?
## జుంజు మార్తమ్మ హత్య కేసును చేధించలేని రాజేష్‌ను
## పులి బుల్లెమ్మ హత్య కేసు విచారణ నుంచి తప్పించాలి
## దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 31)

వైశ్య యువకుడ్ని కొట్టారని పొదిలి ఎస్ఐ వేమనను వి ఆర్ కు పిలిపించిన ప్రభుత్వం, మాదిగల్ని కొట్టి, కులం పేరుతో తిట్టి అవమానించిన తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జున పై చర్య తీసుకోపోవటం దళితుల పట్ల కూటమి ప్రభుత్వ కుల వివక్షకు నిదర్శనమని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ఆందోళన కార్యక్రమంలో నాగేంద్ర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ కులాల పై ప్రత్యేకించి మాల కులం పై కూటమి ప్రభుత్వం కుల వివక్ష చూపుతోందన్నారు. ఈనెల 7న ఒంగోలు పట్టణంలో బలవన్మరణానికి పాల్పడిన మాల యువతి మైరాల నళినీ కేసులో నిందితులను ఇంతవరకూ అరెస్టు చేయలేదన్నారు. మైరాల నళిని కేసులో నిందితులను అరెస్టు చేయాలని కలెక్టర్ జిల్లా ఎస్పీకి లేఖ రాసినా పోలీసులు స్పందించలేదన్నారు. అధికార పార్టీ నేతల కనుసైగకు స్పందించి నిందితుల్ని అరెస్టు చేయలేదన్నారు. కంభం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రస్తుతం పొదిలి సీఐ గా ఉన్న రాజేష్ క్రైమ్ నెంబర్ 184/19 మాదిగ మహిళ జుంజు మార్తమ్మ హత్య కేసులో హంతకుల్ని పట్టుకోలేక, 2023 జులై 30న అన్ డిటెక్ట్ చేశారన్నారు. ఇప్పుడు సిఐ రాజేష్ పొదిలిలో ఉండగా జరిగిన మాల మహిళ పులి బుల్లెమ్మ హత్య కేసులో కూడా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. గోగినేనివారి పాలెంలో హతురాలు పులి బుల్లెమ్మ ఇంటి నుండి పోలీస్ డాగ్స్ ఊళ్ళోకి వెళ్లినా ఏ ఒక్క ఇతర కులస్తుడని కూడా సీఐ రాజేష్ విచారించలేదన్నారు. మాల కులస్తుల్ని విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. పులి బుల్లెమ్మ హత్య కేసు విచారణ బాధ్యతల నుంచి సిఐ రాజేష్‌ను తప్పించాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు గోగినేనివారిపాలెం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని ఎస్సీ, ఎస్టీ యాక్ట్ చెబుతున్నప్పటికీ, హతురాలు పులి బుల్లెమ్మ మాల కులస్తురాలు కాబట్టే, కనీసం వీఆర్ఏ, హెూంగార్డులు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. వైశ్యుడిని కొట్టిన ఎస్ఐ వేమనను విఆర్‌కు పంపారని, పెళ్ళిలో డీజే పెట్టారని మాదిగల్ని కాళ్లతో కొట్టి, కులం పేరుతో తిట్టి అవమానించిన తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జునపై మాత్రం చర్య తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన హెూం మంత్రి అనిత పొదిలి ఎస్ఐ కొట్టిన వైశ్యుడ్ని పరామర్శించారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం విచారం వ్యక్తం చేశారన్నారు. తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జున్ కాళ్ల దెబ్బలు తిని అవమానపడ్డ మాదిగల్ని హెూం మంత్రి అనిత పరామర్శించ లేకపోవడం కూడా కుల వివక్షన్నారు. కూటమి ప్రభుత్వంలో మాదిగ కులానికి చెందిన హెూం మంత్రి అనితకు, ఎస్ఐ కాళ్లతో కొట్టిన మాదిగల్ని పరామర్శించే తీరిక కూడా లేదని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కాకుమాను రవి, దేవరపల్లి రమణయ్య, దళిత నాయకులు మేడికొండ మురళి, చిట్టిమాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు షెడ్యూల్ కులాల అభివృద్ధికి ఉపయోగించాలి

## ప్రతి శాఖలో ఎస్సీ, ఎస్టీల కోసం కేటాయించిన పథకాలు వారికే అందాలి
## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 31)





జిల్లాలో ఉన్న షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం ప్రభుత్వము కేటాయించి నిధులు ఆయా శాఖల పరిధిలో కేటాయించిన శాతం ప్రకారం నిధులు ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కానారేన్స్ హల్ నందు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం ప్రభుత్వము కేటాయించిన నిధులు ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి ఉపయోగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రతి శాఖలలో ఎస్సీ, ఎస్టీలకు అభివృద్ధికి కేటాయించిన వ్యయానికి సంబంధించిన శాతం ఖచ్చితంగా ఖర్చు చేయాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి కేటాయించిన లక్ష్యం మేరకు ప్రభుత్వం నుండి అందే సహాయ సహాకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలని సంబంధిత శాఖ ల అధికారుల ను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఎస్సి, ఎస్టీ లబ్ధిదారులకు లబ్ధి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎస్సీ ఎస్టీలకు అభివృద్ధికి పూర్తిస్థాయిలో నిధులు ఖర్చు చేయాలన్నారు. డిఆర్డిఏ పరిధిలో స్త్రీనిధి కింద రుణాల మంజూరులో, ఉన్నతి, పీఎంఎఫ్ఎంఈ లక్ష్యాలకు సంబంధించి పురోగతి తీసుకురావాలని, ఉపాధి హామీ కింద ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చాలని, హౌసింగ్, ఏపీఎంఐపీ, అగ్రికల్చర్, సివిల్ సప్లై, మున్సిపాలిటీ ఇతర అన్ని శాఖల పరిధిలో వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకోవడంపై దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లతో సోషల్ వెలేఠర్ డిడి, డిటిడబ్ల్యువోలు మాట్లాడి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం కేటాయించిన పర్సంటేజ్ ప్రకారం నిధులు ఖర్చు చేసేలా చూడాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం నిధులను కేటాయించి వాటిని ఖర్చు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, వీలైనంతవరకు అధికారులు లక్ష్యాన్ని చేరుకునేందుకు దృష్టి పెట్టాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలకు లబ్ధి చేకూర్చేందుకు ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ లవన్న, సిపిఓ ఏ ఎస్ రాజు, మహిళ శిశు సంక్షేమ సాధికారత అధికారణి రాధమాదవి, సాంఘిక, గిరిజన సంక్షేమ, పశుసంవర్ధక, ఆర్డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్, మైనర్ ఇరిగేషన్, హార్టికల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డ్వామా, డిఎస్ఓ, డీఈఓ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 3 నుండి రీ సర్వే భూహక్కు పత్రాలు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, డిసెంబర్ 31)



రీ సర్వేలో భాగంగా మండలంలో ఇప్పాటివరకు రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూహక్కు పత్రాలను 3జనవరి నుండి అందించనున్నట్లు మండల తహశీల్దార్ జె ప్రభాకకరావు తెలిపారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ మండలంలో గొనసపూడి, చింతగుంపల్లి మరియు కడవరకుదురు గ్రామాల్లో రీసర్వే పూర్తి అయినట్లు తెలిపారు. జనవరి 3న గొనసపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, జనవరి 4న చింతగుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, 7న కడవకుదురు గ్రామ పంచాయతీలో ఉదయం 11 గంటల నుండి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత రైతులందరు హాజరై తమ భూహక్కు పత్రాలు తీసుకోవాలని తెలియాజేసారు.

# ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

## 2026లో కూటమి ప్రభుత్వం మరింత ప్రజాహిత కార్యక్రమాలు
## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం
## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, డిసెంబర్ 31)

నూతన సంవత్సరం 2026 సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026లో కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గత ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మేలు చేశాయని పేర్కొన్న ఎమ్మెల్యే రానున్న రోజుల్లో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పర్చూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, విద్యా-వైద్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం విశేష ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. అంతే కాకుండా నూతన సంవత్సరం ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, సంతోషం నింపాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# విజయవాడ గోసలైట్ గంగూరు బ్రాంచ్‌లో ఫస్ట్ ఇయర్ బైపిసి విద్యార్థుల యానివర్సరీ



(షణ్ముఖ వెలుగు, విజయవాడ, డిసెంబర్ 31)

విజయవాడ గోసలైట్ గంగూరు బ్రాంచ్‌లో ఫస్ట్ ఇయర్ బైపిసి విద్యార్థుల యానివర్సరీ ఘనంగా నిర్వహించబడినది. ఈ కార్యక్రమానికి కోసలైట్ సంబంధించిన అన్ని బ్రాంచిల బాలికలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎబినేజర్, ప్రిన్సిపాల్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపజేశారు. అంతే కాకుండా ఈ బ్రాంచ్‌లో విద్యార్థులను క్రమశిక్షణగా కట్టుదిట్టమైన క్రమశిక్షణతో చైర్మన్ ఆదేశాలతో విద్యార్థులను బాగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఎక్కువమంది మెడికల్‌గా సెలెక్ట్ కావాలని ఆశిస్తూ నిర్వహిస్తున్నారు.

# గిరిజన మహిళలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నూతన సంవత్సర కానుక

**అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్‌లో కురిడీ గ్రామంలో పర్యటించిన పవన్ కల్యాణ్**
**రక్తహీనత కారణంగా గిరిజన మహిళలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు తెలుసుకున్న వైనం**
**సమస్య పరిష్కారానికి అరకులో ఆధునిక బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మిస్తున్నామన్న పవన్ కల్యాణ్**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 31)**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మన్యం ప్రాంత గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక కానుక ప్రకటించారు. గిరిజన మహిళలను గర్భస్రావాలు, రక్తహీనత వంటి ప్రాణాంతక సమస్యల నుంచి కాపాడే లక్ష్యంతో అరకులోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆధునిక బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు.'అడవితల్లి బాట' కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఏప్రిల్ నెలలో పవన్ కల్యాణ్ వెళ్లిన సందర్భంగా కురిడీ గ్రామంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ సమయంలో ఒక గిరిజన మహిళ రక్తహీనత కారణంగా గిరిజనులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆరోగ్య సమస్యలను పవన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా జన్యుపరంగా వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గర్భిణుల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని వివరించారు.ఈ సమస్యకు తప్పకుండా పరిష్కారం చూపుతానని అప్పుడే హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం.. అనంతరం సికిల్ సెల్ ఎనీమియా నివారణపై వైద్య నిపుణులతో చర్చించారు. వారసత్వంగా వచ్చే ఈ వ్యాధి తీవ్రతను రక్తమార్పిడి ద్వారా నియంత్రించవచ్చని నిపుణులు సూచించడంతో, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.నూతన సంవత్సర కానుకగా బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ భవనంలో అవసరాలకు అనుగుణంగా రక్తాన్ని నిల్వ చేసుకునేందుకు అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు దాతలు సమకూర్చనున్నారు.త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అరకులోని ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానం చేస్తామని పవన్ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 1,500 మంది సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు మేలు జరగనుంది.

# ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ విస్తరించండి పుతిన్ ఆదేశాలు

**ఉక్రెయిన్‌పై కీలక నిర్ణయం తీసుకున్న పుతిన్**
**భద్రతా బఫర్ జోన్ విస్తరించే దిశగా ఆదేశాలుమ**
**ముందుకు సాగుతున్న రష్యా బలగాలు**



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 31)**

కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భారీ దాడులు చేస్తున్న రష్యా... తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉక్రెయిన్ కు చెందిన మరింత భూభాగాన్ని ఆక్రమించుకునే దిశగా అడుగులు వేస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నుంచి సైన్యానికి ఉక్రెయిన్ భూభాగంలో 'భద్రతా బఫర్ జోన్'ను విస్తరించమని ఆదేశాలు వచ్చాయని రష్యా సైనిక జనరల్ వాలేరి గెరసిమోవ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో, సుమీ, ఖర్కీవ్ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలను ఆక్రమించేందుకు రష్యా సైన్యాలు ముందుకు సాగనున్నాయి. మరోవైపు, పుతిన్ అధికారిక నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లు ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, పుతిన్ ఇచ్చిన ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సరిహద్దుల్లో ఉక్రెయిన్ చొరబాట్లకు అడ్డుపడేలా భద్రతా బఫర్ జోన్ ఏర్పాటు చేయాలనేది పుతిన్ నిర్ణయం. ఇటీవల ఉక్రెయిన్ సుమీ ప్రాంతంలోని నాలుగు సరిహద్దు గ్రామాలను మాస్కో సీజ్ చేసింది. పుతిన్ ఇచ్చిన తాజా ఆదేశాల ప్రకారం, బఫర్ జోన్‌ను మరింత విస్తరించడం కోసం సైన్యాలు ముందుకు కదలనున్నాయి.ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నప్పటికీ, పరస్పర దాడులు ఆగడం లేదు. రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ ప్రకారం, ఉక్రెయిన్ తాజాగా 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను రష్యాపై ప్రయోగించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో సరిహద్దుల్లో సాంకేతిక, భౌగోళిక మార్పులపై మరిన్ని ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉంది.

# పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 31)**

పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఇంకొల్లు మండలం ఇంకొల్లు గ్రామంలో ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారురాలైన లేళ్ల సింగమ్మ, అత్తులూరి రుక్మిణి కి వితంతు పింఛన్, నర్రా వెంకటేశ్వర్లు కు వృద్ధాప్య



పింఛన్ అందజేశారు. లబ్ధిదారుల యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ సొమ్మును ఎలా వినియోగించుకుంటారని ఆరా తీశారు. గుండె జబ్బుతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నానని సింగమ్మ చెప్పడంతో తక్షణమే వైద్యాధికారులను పిలిపించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. భర్త చనిపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నానని, సొంత ఇల్లు లేక అద్దె కట్టుకుంటున్నానని చెప్పడంతో కలెక్టర్ స్పందించారు. రుక్మిణి కి ఇంటి స్థలం కేటాయించి, నిర్మాణానికి ఏఐవైఎఫ్ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 92 ఏళ్ల వ ృద్ధుడు వెంకటేశ్వర్లు కు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో చీరాల ఆర్ డి ఓ టి చంద్రశేఖర్, డిఆర్ డిఏ పిడి ఉప కలెక్టర్ లవన్న, మండల ప్రత్యేక అధికారి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడి రమేష్ బాబు, తహసిల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిధిలోని నిప్పట్లపాడు ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 31)**

ప్రతి నెలలో చివరి వారంలో జరిగే పౌర హక్కుల దినోత్సవం చీమకుర్తి మండలం నిప్పట్లపాడు ఎస్సీ కాలనీ నందు బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్ మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు మాట్లాడుతూ పౌరుల యొక్క హక్కులు గురించి వివరించారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అధికారుల ద ృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజలు అందరం చట్టం ముందు సమానులని రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 తెలియచేస్తుందని గ్రామాలలో ఎవరైనా కులవివక్ష చూపినా, అంటరానితనాన్ని ప్రోత్సహించిన సివిల్ రైట్స్ యాక్ట్,1955 లోని ఆర్టికల్ 17 ప్రకారం అది చట్టరీత్యా నేరం మరియు శిక్షార్హం అవుతుందని అటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని వెంటనే పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలు అధికారుల దృష్టికి కాలనీ నందు మంచి నీటి సరఫరా సమస్య ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ యంపిడిఓ శ్రీధర్, సునీల్ కుమార్, శ్రీనివాసరావు, గ్రామ రెవిన్యూ అధికారి చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ రహీం బాబు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




# టెంకాయచెట్లపాలెం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో కరేడు గ్రామ టిడిపి అధ్యక్షులు నేలటూరి ఆదాము

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 31)**

మండలంలోని కరేడు గ్రామ టెంకాయచెట్ల పాలెంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కరేడు గ్రామ టిడిపి అధ్యక్షులు నేలటూరి ఆదాము చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్య పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# ప్రకాశం జిల్లా స్థానంలో మార్కాపురం జిల్లాగా పేరు మార్పు



**(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 31)**

నూతన జిల్లాగా మార్కాపురం అవతరించడంతో ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న ప్రకాశం జిల్లా అనే పేరును తుడిచి వేసి ఆ స్థానంలో మార్కాపురం జిల్లాగా కంభం తహశీల్దార్ కిరణ్ పేరు మార్పించారు. ఇక పై అన్ని ప్రభుత్వ కార్యాలయాల పై కూడా ప్రకాశం జిల్లా స్థానంలో మార్కాపురం జిల్లా పేరు రాయడం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు.

# సొసైటీల ద్వారా సున్నా వడ్డీకే రైతు రుణాలు

## జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, డిసెంబర్ 31)**

చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు వ్యవసాయ సహకార సంఘాలు (పీ ఏ సీ ఎస్)ద్వారా సున్నా వడ్డీ కే రుణాలు మంజూరు చేస్తున్నట్లు జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. వినుకొండ పిఏసిఎస్ కార్యాలయం సొసైటీ వార్షిక ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మక్కెన మాట్లాడుతూ వినుకొండ పి. ఏ. సీ.ఎస్ పరిధిలో 1900 మంది రైతులకు 47, డ్వాక్రా సంఘాలకు 10 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సొసైటీల ద్వారా రు.1లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు, అదనంగా రూ.2 లక్షలకు 32 పైసలు వడ్డీకే రుణాలు ఇస్తున్నామని వెల్లడించారు. వినుకొండ పరిధిలోని 8 సొసైటీల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. సన్న, చిన్న కారు, మధ్య తరగతి రైతులు సొసైటీల ద్వారా వచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని మక్కెన కోరారు. సంక్రాంతి నుండి పాత రుణాలు వసూలు ప్రారంభించాలని సిబ్బంది, సూపర్వైజర్ పార్ట్ సెక్రెటరీ సీఈఓ ను ఆయన ఆదేశించారు. సమావేశంలో నోడల్ అధికారి, సెంట్రల్ బ్యాంకు ఏజీఎమ్ సుబ్బారావు, వినుకొండ పిఏసీ డైరెక్టర్ శ్రీనివాసరావు, నోడల్ అధికారి రవి, సొసైటీ కార్యదర్శి సికె రెడ్డి, సూపర్ వైజర్ బ్రాహ్మయ్య, రెడ్డి వెంకటరత్నం, కె చెన్నకేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# గొట్టిపాటిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవ

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, డిసెంబర్ 31)**

బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామనికి చెందిన నక్కల వీర రాఘవులు బుధవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు అందించి, శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోండ్రగుంట శ్రీహరి, నాగరాజు, నక్కల తేజ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో గ్యాస్ కనెక్షన్ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి







(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, డిసెంబర్ 31)

ప్రతి ఇంట్లో గ్యాస్ కనెక్షన్ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం మద్దిపూడి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ యోజన 3.0 పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఏపి మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలలో కట్టెలపొయ్యి వాడటం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని భావించి ప్రతి ఒక్కరి ఇళ్లల్లో గ్యాస్ కనెక్షన్లు ఉండేలా ఉజ్వల గ్యాస్ యోజన 3.0 పథకం క్రింద మహిళలకి ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 555 మందికి ఈ ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈరోజు అర్హులైన 44 మంది లబ్ధిదారులకు సిలిండర్, గ్యాస్ పొయ్యి, సురక్ష ట్యూబ్, రెగ్యులేటర్, పాస్ పుస్తకం మంత్రి స్వామి అందించారు. మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కట్టెల పొయ్యి వాడి అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఉండాలని మంచి ఉద్దేశంతో 2016 లో ఉజ్వల పథకం ద్వార ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మన మద్రిపూడి మండలంలో నివేదిత గ్యాస్ ఏజెన్సీ వారు 300 మంది నమోదు చేసుకుంటే 250 మందికి ఈ పథకం కింద గ్యాస్ కనెక్షన్లను ఇవ్వటం జరిగిందని చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడు కూడా జన్మభూమి పథకంలో భాగంగా దీపం -1 కింద గ్యాస్ కనెక్షన్లు ఇవ్వటం జరిగింది. ఎన్నికల హామీలో బాగంగా కూటమి ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లు ప్రజలకి ఉచితంగా ఇస్తామని చెప్పి, మాట తప్పకుండా ప్రజలకి దీపం పథకం కింద అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా మన నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. పొదిలి నుండి కూచిపూడి వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మద్యలో నిలిచిన అంగన్వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పొదిలి కొండ మీద ఉన్న నరసింహ స్వామి దేవాలయంకి రూ.4 కోట్లతో రోడ్డును మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా గుడి ఆధునీకరణకు కూడా నిధులు మంజూరు చేశామన్నారు. జువ్విగుంట నుండి శివరాయనిపేట, ఉప్పలపాడు వరకు రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇటువంటి ఎన్నో అబివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, పేదరికాన్ని నిర్మూలించటమే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. వలసలని నిర్మూలించాలని ఇండస్ట్రియల్ పార్కులను తీసుకొచ్చిందన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న మన కూటమి ప్రభుత్వంకి ప్రజలు అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మారిటైమ్ బోర్డు చైర్మెన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచి దాదాపు 18 నెలల కాలంలో అనేక అబివృా, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం మనదన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ సూపర్ హిట్ అయ్యాయని అని కొనియాడారు. తల్లికి వందనం పథకం కింద సుమారు 10 వేల కోట్ల రూపాయలు సుమారు 67 లక్షల మంది విద్యార్థులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర సంబరాలు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 31)

కందుకూరు పట్టణంలోని బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల వారి పామూరు రోడ్ నందు ఉన్న ఒలంపియాడ్ స్కూల్, ఐఐటి, మెడికల్ అకాడమీ జూనియర్ కాలేజ్‌లలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయమైన వస్త్రాలతో ఆకర్షణీయంగా కనిపించారు. ఆనందోత్సాహాలతో కేకులు కట్ చేసి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పారు. ఒకరినొకరు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందరరేగా బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ పాత సంవత్సరంలో తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నూతన సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ జి బాల భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనలో ఉన్న లోపాలను సవరించుకొని నూతన సంవత్సరంలో అందరూ నూతన లక్ష్యాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి నరేంద్ర బాబులు వారి విలువైన సందేశాలను విద్యార్థులకు తెలియజేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ కాలేజ్, పాఠశాలల డీన్స్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

### సూదివారిపాలెంను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించిన ఎమ్మెల్యే

### పలువురికి ఎమ్మెల్యే ఏలూరి పరామర్శ



(షణ్ముఖ వెలుగు, పర్చూరు ఇన్‌ఛార్జి, డిసెంబర్ 31)

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు క ృషి చేస్తున్నామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. సూదివారిపాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివ ృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వ ృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితరులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా వారి చేతుల్లోకి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పలువురు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "గ్రామీణాభివ ృద్ధి ద్వారానే రాష్ట్ర అభివ ృద్ధి సాధ్యమవుతుంది. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తాం. సూదివారిపాలెంను అన్ని రంగాల్లో అభివ ృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా నిలిపే బాధ్యత నాదే" అని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన చేసిన గోకులాన్ని పరిశీలించారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com